# కల్లు!!

●

[ శ్రీ మల్లాది నరసింహశాస్త్రి ]

●

ఎంతసేపటినుంచో-ఏకాకిగా - నిశిలో కూర్చొనియున్నాను. మబ్బు కన్నెలు చంద్రుని తమ బాహువల్లరిలోనికి తీసుకొని ప్రపంచాన్ని చీకటి చారికలతో నింపుతున్నాయి. జీవితం—ఆనందంలో ఓలలాడుతూండగా వచ్చేకష్టాల విషచ్ఛాయలువలె వెన్నెలవెలుగుల్ని కారుమబ్బులు మింగివేస్తున్నాయి.

దూరాన నక్కకూతలు—చుట్టుపట్ల కీచురాళ్ళ మోత—పరిసరాల ఆకాశంవేపుకు మోరలెత్తి ఏడ్చేకుక్కలగోలా ప్రకృతిలోని, నిశ్శబ్దతకు భంగం కలిగింపచేస్తున్నాయి.

అప్పటికి ఎనిమిది గంటలరాత్రి అయివుంటుంది. ఎంతకాలంనుంచో కాలాన్ని అనుసరించి విధిని నెరవేర్చుకొనటం మానివేశాను. ఇల్లు...చెల్లాయి ఆకలితో ఏడవటం...నాన్న తప్పత్రాగి వచ్చి—అమ్మను చావబాదటం....మొదలైన దృశ్యాలతో కళ్లు చెమ్మగిలినప్పుడు—ఆ ఏకాంతప్రదేశానికిపోయి — పచ్చికలోపరుండి 'గృహములోని అశాంతిని—ఆ ఆకలిని, ఎట్లా,ఎదుర్కొని జయించగలనా' అని ఆలోచిస్తూవున్నాను.

ఏవిధంగా అమ్మని నాన్న బాధలనుండి తప్పించటం, చెల్లికి ఆకలిచిచ్చు ఎట్లా తీర్చటం అనే సమస్య జ్యోతిచుట్టూ ప్రదక్షిణచేసే కీటకంలాగా తపనపడుతోంది.

అబ్బ!

ఈపదునారు వసంతాల ఈడుకే జీవితంలో ఎన్నిసమస్యలు— ఎన్నికష్టాలు — ఎన్నివుద్రేకాలు ప్రేమించి నన్ను ఆవహిస్తున్నాయో !

ఆసమయంలో అమ్మ అక్కడికి వచ్చింది. నేనక్కడవున్నానని ఆమెకెట్లా తెలుసో!

"ఒరేయ్....నాయనా"

"ఏమమ్మా....అదుర్దాగావచ్చావ్?"

"మీనాన్న ఇంటికి యిప్పటిదాకా రాలేదు తప్పత్రాగి ఎక్కడపడివున్నారో — నువ్వుపోయి చూసిరా—నాయనా"

"నేను చూసివస్తాను నువ్వు గుడిశకు పో అమ్మా" అని పరుగుపుచ్చుకొన్నాను.

అమ్మ కళ్లనుండికారే కన్నీటిజాలు నా హృదయంలోని తండ్రిమీదిద్వేషం — కోపాగ్నిజ్వాలలను మొదలంట చల్లార్చినవి.

కల్లుఅంగడివద్ద బాగా సందడిగావుంది. లోనించివచ్చే వాసన పీల్చేందుకు దుర్భరంగావుంది. కాని ఏంచేస్తాను. మీదపడే తూలుడు శరీరాల్ని తోసుకొంటూ లోనికివెళ్లి నాన్నకోసం నలుదిక్కులూ తేరపారిచూచాను. కాని అక్కడ నాన్న లేడు.

అంగడిలోనుండి బయటపడి రోడ్డుపుచ్చుకొని సరాసరి కొంతదూరం నడచి—మలుపుతిరిగాను. ఒక్కసారి నవనాడులూ క్రుంగుకుపోయేలాంటి దృశ్యం. నాన్న కళేబరం మంటిలో పొర్లుతోంది. చెప్పనలవికాని బాధతో ఏడ్చాను. నానాతంటాలుపడి కొంపకిచేర్చాను.

అమ్మ—నాన్న ఒళ్ళంతాతుడిచి మంచిబట్టలు కట్టబెట్టి పడుకోబెట్టింది. త్రాగుడు పిశాచాన్ని కామించిన—నాన్న త్రాగేటప్పుడు సుఖం అనుకొని త్రాగి....వినలేని దుర్భాషలు కూస్తున్నాడు. అమ్మ—నాన్న ప్రక్కనకూర్చొని విసురుతోంది. నేనూ చెల్లి మంచంకుక్కిలో చేరాము. క్షణాలు-నిమిషాలు—గంటలు—ఎన్నిగడిచాయో తెలియదు.

నాన్నకు కొదిగా మత్తుతీసినట్లుంది. లేచికూర్చొని "ఏ—య్....ఎక్కడ?" అని వురిమాడు.

అమ్మ వొణుకుతూ "ఏం—ఇక్కడేవున్నాను...కొంచెం విశ్రాంతి తీసుకోండి" అంది.

"ఛట్ నోరుముయ్ !"

అందరం పంచప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొన్నాము.

లేచి అమ్మవంకచూచి :

"అన్నంపెట్టు" అన్నాడు. ఆయన కడుపులోనికల్లు పిశాచి ఆకలి అని అరుస్తోందికాబోలు.

అమ్మ కంటిరెప్పలు వాలాయి. "రెండురోజులయింది...పిల్లలూ....నేనూ తిండితిని" అన్నది.

"మీరుతింటే తిన్నారు, చస్తే చచ్చారు. నాకు ముందు తిండిపెడతావా—లేదా"

ఆగర్జనకు పక్షులుసహితం ఆపరిసరాల ఎగరటంలేదు. కోడిపుంజు ఎగిరి గుడిశ నడికొప్పు ఎక్కింది. "ఎక్కడనుంచి తేను" అని అమ్మ అన్నదో లేదో ఛల్లున చెంపపగిలేటట్టు కొట్టాడు—ఆరాక్షసి.

ఎక్కడలేని ఆవేశం నాసర్వరక్తనాళాల్లోను వుద్రేకించి పొంగింది. స్ఫురునలేచి- గుక్కపట్టి ఏడుస్తూన్న చెల్లిని సహితం తప్పించుకొని ప్రక్కనే వున్న కట్టెపేడు తీసుకొని- అబ్బ...—నాన్న నడినెత్తినకొట్టాను. తలపగిలి రక్తం ప్రవహిస్తోంది. నాన్న క్రిందపడిపోయాడు- అడ్డుకున్న అమ్మ భుజానికి బలమైన గాయం.

ఇదివరకల్లా ఎంతో సున్నితంగా భావించిన ఈ నా లేతహృదయంలో ఎన్నో అవ్యక్త వుద్రేకాలు ప్రవేశించి నన్ను అల్పుణ్ణీ- నీచుణ్ణీ చేస్తున్నాయి. కాని ఏంచెయ్యగలను. ఆ సంఘటన అట్లావచ్చింది. తరువాత ఎంతో బాధతో హృదయం కరిగి నీరగునట్లుగా అమ్మ నాన్న గాయాలు చూచి ఏడ్చాను.

తరవాత ఆలోచించాను. నాన్న ఒకప్పుడు మంచివాడే. ఆయన చెల్లికంటే నన్నే ఎక్కువ ప్రేమించేవాడు. కాని త్రాగుడికి అలవడి ప్రేమించే శక్తిని కోల్పోయినాడు. ఆయన్ని- ఆయన మానవతత్వాన్ని ఏమనగలం? ఏమైనాకాని నా కన్నతల్లిదండ్రులు నాకు ప్రేమాస్పదులు.

అమ్మా నాన్నా మంచంమీదవున్నారు. సపర్యలు చేశాను. నాన్న నెత్తికి కట్టుకట్టాను. కాని ఆరక్తప్రవాహం ఆగదే. అది యదేచ్ఛగా గడ్డ పొరలోనుండి తప్పించుకొని ప్రవహిస్తోంది. చెల్లిని వోదార్చేందుకు కాలంలేదు. ఊళ్ళోకి డాక్టరు కోసరం పరిగెత్తాను.

డాక్టరు పాతికయిస్తేతప్ప రానన్నాడు. పాతికగింజలు లేని సమయంలో- ఎక్కడ నుంచి వస్తాయి పా-తి-క రూపాయలు.

ఆయన కాళ్ళమీదపడి రక్షించమనాన్ను.

ససేమిరా, రానన్నాడు.

అప్పటికే పదిదాటింది. బజారులోకి వచ్చాను.

ఆలోచనకి వ్యవధిలేదు. ఎన్ని విషమ సమస్యలో హృదయాన్ని పెనవేసుకొని కూర్చున్నాయి. వేనోన్నదృశ్యాలు మెదడులో పరిగెత్తుతున్నాయి. అమ్మానాన్న మృత్యుశయ్య... చెల్లాయి దిక్కులేని ఆక్రందన—చెప్పలేను...!

ఎదురుగా విక్టోరియా బేకరీలో లైటు వెలుగుతోంది. కొట్టు యజమాని బల్లకు కాళ్లు నిగడతన్ని కుర్చీలో నిద్రపోతున్నాడు. మెల్లిగా పోయి డబ్బులాగి నాల్గునోట్లను జేబులోవుంచి- బయటికి దారితీస్తున్నాను.

ఒక కుక్క 'భౌంయ్' మని మొరిగింది.

దుకాణదారుడు వులిక్కిపడిలేచి "ఏయ్— ఆగు...ఆగు....దొంగ....దొంగ" అని అరిచాడు.

పరుగుపుచ్చుకొన్నాను. కారుచీకటి ఆకసంలో అక్కడక్కడ చుక్కలు కొద్దిగా కాంతినిస్తున్నాయి. దారి కన్పడటంలేదు. ఒగర్పు— ఆయాసం ఎక్కువవుతున్నాయి.

వెనుక ఎన్నోపాదాల శబ్దాలు వినవస్తున్నాయి. వెనకనుంచి ఆగమని కేకలు :

మలుపుతిరిగి మాగుడిశ వేపుకు పరిగెత్తాను.

"అయ్యో...ఏమిటవీ...మంటలు...మంటలు ...ఆకాశాన్ని...అంటుతున్నాయి ... అమ్మో ... మాగుడిశే..."

రాయితగిలి పడిపోయాను. వెనకనుంచి కర్రలతో స్పృహలేకుండా చితకపొడిచేశారు. రక్తపుముద్దనయాను.

తర్వాత రెండునెల్లు ఆసుపత్రి, నాల్గుసంవత్సరాలు ఖయిదులోను వున్నాను.

ఇంతకీ కారణం మానాన్నకు ప్రియమైన కల్లు....!